కోట్ల రూపాయలతో రూపకల్పన చేసిన "అనిల్ అనురాగ కేంద్రం" ప్రారంభోత్సవం ఆరోజే.

చుట్టుపక్కల అయిదారు గ్రామాల ప్రజలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టరు, స్వచ్ఛంద సేవకులు, అధికారులు... ఎటు చూసినా సందడే సందడి. అయిదేళ్ల వికలాంగ బాలికతో అనాథాశ్రమం రిబ్బన్ కట్ చేయించడం ద్వారా పరోక్షంగా సంస్థ ఉద్దేశాన్ని చాటిచెప్పాం.

మీటింగ్ మొదలయింది. వేదిక మీద ముఖ్యులు ఆసీనులయ్యారు. నేను ముందువరస సీటులో కూచుని అనిల్‌నే గమనిస్తూండిపోయాను.

వక్తల నుంచి వచ్చే సూచనల్ని శ్రద్ధగా నోట్ చేసుకుంటున్నాడు. అతని మొహంలో ఏదో ప్రశాంతత. ఎంతో సంతృప్తి.

సంవత్సరం కిందట నేను చూసింది ఈ వ్యక్తినేనా?

వారం రోజుల సాహచర్యంలో డబ్బుకంపు కొట్టింది ఇతనేనా?

నా మనసు 14 నెలల గతంలోకి పరుగులు తీస్తోంది...



***

ఇప్పుడు అనిల్ ఎలా ఉండి ఉంటాడు?

లావై ఉంటాడా? రంగుదేలి ఉంటాడా?

డిప్లొమా చదువుకున్నప్పటి రోజులు గుర్తుంటాయా?

డబ్బుల్లేక ఓ శనివారం రాత్రి ఒక అరటిపండు కొనుక్కొని, చెరిసగం తిని, మంచినీళ్లు తాగిన రోజులు గుర్తుంటాయా?

నాలుగేళ్ల కిందట జపాన్ వెళ్లేముందు చూశాను.

ఆలోచనలన్నీ అనిల్ చుట్టూనే తిరుగుతున్నాయి.

ఫ్లైట్ అరగంట ఆలస్యం అయినందుకేమో, ఎయిర్‌పోర్టులో నా

# ఏడు వారాల నగలు

## ఎమ్వీ రామిరెడ్డి

కథ

పక్కనే కూచున్న అనిల్ వాళ్ల అమ్మానాన్నలు అసహనంగా కదులు తున్నారు. పాలిటెక్నిక్ పూర్తయ్యాక చదువు కొనసాగించే స్థోమత లేక నేను చిన్న ఉద్యోగంలో చేరితే, వాడు మాత్రం ఈసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని ఇంజినీరింగ్ పూర్తి చేసి, విదేశాలకు ఎగిరిపోయాడు.

జపాన్ వెళ్లినా స్నేహాన్ని మర్చిపోలేదు. క్రమం తప్పకుండా ఫోన్ చేసేవాడు. నాలుగు రోజుల క్రితం ఫోన్‌చేసి, ఇండియా వస్తున్నానని చెప్పాడు. తొమ్మిది రోజులు మాత్రమే ఉంటాననీ, వారం రోజులు తనతో కలిసి ఉండాలనీ గట్టిగా చెప్పటంతో అతికష్టం మీద వారంపాటు తీరిక చేసుకున్నాను. విమానం వచ్చిందన్న ప్రకటన వినగానే అనిల్ అమ్మా నాన్నలు లేచి నించున్నారు. నాకూ అంతే ఆత్రంగా ఉంది, వాణ్ని ఎప్పుడెప్పుడు చూస్తానా అని.

ఫార్మాలిటీస్ పూర్తవడానికి మరో అరగంట!

అల్లంత దూరాన వాడు కనిపించగానే మా ముగ్గురి కళ్లూ మెరిశాయి.

వాడు చకచకా నడుచుకుంటూ వస్తున్నాడు.

చూపుల్లో చురుకుదనం, కదలికల్లో వేగం ఇంకాస్త పెరిగాయే తప్ప తగ్గలేదు. కాస్త ఒళ్లు చేశాడు. రంగు పెద్దగా మారింది లేదుగానీ, శరీరం నునుపు తేలింది. మా దగ్గరకు వస్తూనే ముందుగా వాళ్లమ్మను హత్తుకుని, తండ్రి పాదాలను స్పృశించాడు. ఆ తర్వాత నావైపు తిరిగి "ఏరా మాధవ్, ఎలా ఉన్నావు? మొత్తానికి తీరిక చేస్కొని వచ్చావే" అంటూ గట్టిగా కౌగిలించుకున్నాడు.

వాడి లగేజీ సర్దడం పూర్తయ్యాక, అందరం సుమో ఎక్కాం.

"ఏరా పాండు, ఎలా ఉన్నావు? పిల్లలు బాగున్నారా? రోజూ డ్యూటీకి వస్తున్నావా, లేక అమ్మా నాన్నల్ని ఇబ్బంది పెడుతున్నావా?" డ్రైవర్ని అడిగాడు అనిల్.

"లేదు సారూ, సక్కంగనే వస్తుండా".

"సరే మంచిది. నేను 9 రోజులుంటాను. ఇవ్వాళ ఒక్కరోజే నీకు రెస్టు. రేపు ఉదయం వచ్చేటప్పుడు బ్యాగు, బట్టలు తెచ్చుకో. ఫుల్ టైమ్ నాతోనే ఉండాలి".

"అలాగే సారూ".

"తమరి సంగతేంటి బాబూ? ఉద్యోగానికి సెలవు పెట్టారా, లేదా?"

"ఫోన్లో తమరు అంత మర్యాదగా చెప్పినప్పుడు పెట్టక ఛస్తానా?"

పెద్దగా నవ్వేశాడు అనిల్, వాళ్ల అమ్మా నాన్నలు మావైపు ఆత్మీయంగా చూశారు.

### గురువారం

ఉదయం 8 గంటలకు కారు బయల్దేరింది.

"హరియప్, ముందు పంజాగుట్టకు పోనియ్ పాండూ".

అనిల్ ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. అన్నీ డబ్బులోంచి దూరి డబ్బు గుండా బయటికొచ్చి డబ్బు రూపంలో మెరిసిపోతున్నవే!

చకచకా లెక్కలు వేస్తున్నాడు. కేపిటల్, ప్రాజెక్ట్ డ్యురేషన్, ఇంప్లిమెంటేషన్... అంటూ క్షణాల మీద లావాదేవీలు వల్లె వేస్తున్నాడు. అంతిమంగా ఎంత లాభం సొంతమవుతుందో వివరిస్తున్నాడు.

నేనేమో వాడి జపాన్ జీవితం గురించి ఆరా తీస్తున్నాను.

"నా జీవితానికేం బ్రహ్మాండంగా ఉందిగానీ, ఈ యాడ్ చూశావా?

**మాధవ్, నేను ఏ పనినైనా ఇరవై సార్లు ఆలోచించి చేస్తాను. మనం చూసిన పొలం పక్కనే ప్రభుత్వం అపెరల్ పార్కు నిర్మించబోతుంది. ఈ విషయం ఇంకా బయటికి పొక్కలేదు.**

ఇదో పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీ. గచ్చిబౌలి దగ్గర 15 ఎకరాల్లో 5 టవర్లు కట్టబోతుంది. ఒక్కో టవరు 25 అంతస్తులు. ఒక్కో ఫ్లాటు కోటి రూపాయలు. కొన్ని డ్యూప్లెక్స్ హౌస్‌లు కూడా కడుతున్నారు. ఒక్కోటీ రెండున్నర కోట్లు. మనం అంత పెట్టలేంగానీ ప్రస్తుతానికి ఓ ఫ్లాట్ బుక్ చేద్దామనుకుంటున్నాను" ఓ పేపర్ కటింగ్ చూపిస్తూ చెప్పాడు అనిల్.

"సొంతిల్లు ఉంది గదా. ఉండేది మీ అమ్మా నాన్నలిద్దరే కదా. మరో ఫ్లాట్ దేనికి?"

"గచ్చిబౌలిలో ఫ్లాట్ కొనడానికి 70లక్షలు బ్యాంక్‌లోన్ వస్తుంది. దాన్ని అద్దెకిస్తే నెలకి తేలిగ్గా యాభై వేలు వస్తాయి. ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో ఇదో ఫార్ములా".

కారు పంజాగుట్టలో ఓ కార్యాలయం ముందు ఆగింది.

లోపలికి అడుగు పెడుతుంటే, మంచు పర్వతాల సమీపానికి వచ్చినట్లు అనిపించింది. అందమైన అమ్మాయి సాదరంగా స్వాగతం పలికి, ఏం కావాలో అడిగింది ఇంగ్లిషులో. అనిల్ చెప్పాడు.

ఆమె మమ్మల్ని ఓ కౌంటర్ దగ్గరకు తీసుకెళ్లింది. అక్కడ మరో అమ్మాయి ఉంది.

"సర్, ప్లీజ్ బీ సీటెడ్" మృదువుగా పలికింది.

కూచున్నామో లేదో ఓ కుర్రాడు రెండు కోకోకోలా డబ్బాలు తెచ్చి, మూతలు తీసి మా ముందుంచాడు.

అనిల్ ఓ డబ్బా అందుకుని నాలుగు గుటకలు వేసి, కింద పెడుతూ "తీసుకోవేం" అన్నట్లు చూశాడు నా వైపు. నేనూ అందుకున్నాను.

ఆ అమ్మాయి మొదలుపెట్టింది.

"సర్, ద లొకేషన్ వజ్ ఇన్ ద హార్ట్ ఆఫ్ ఐటీ హబ్ అండ్ సరౌండెడ్ బై నేచురల్ వండర్స్. నార్త్-ఈస్ట్ ఫేసింగ్, ద బెస్ట్ వాస్తు. వియ్ ఆర్ గోయింగ్ టు బి కన్‌స్ట్రక్టెడ్ ఫైవ్ రెసిడెన్షియల్ టవర్స్ ఆఫ్ 25 ఫ్లోర్స్ ఇన్ 15 యాకర్స్. దేర్ ఆర్ సో మెనీ స్పెషాలిటీస్..." ఆమె చెప్పుకుంటూ పోతోంది.

లోన్ సౌకర్యం గురించి అడిగాడు అనిల్. మరికొన్ని అనుమానాలు నివృత్తి చేసుకున్నాడు.

గంటన్నర తర్వాత 12వ అంతస్తులో ఓ ఫ్లాట్ బుక్ చేసుకున్నాడు.

ఆ అమ్మాయి కొన్ని సంతకాలు తీసుకుంది. వ్యవహారం ముగిసేసరికి రెండు దాటింది.

బయటికొచ్చి కారెక్కాక, తాజ్‌కృష్ణ హోటల్‌కు పోనివ్వమన్నాడు.

ముగ్గురం భోంచేశాం. బిల్లు రూ.3,600 అయింది. నేను రెండు నెలలకు చెల్లించే మెస్ బిల్లు అది.

ఈసారి కారు ప్రయాణం గచ్చిబౌలి వైపు.

సదరు నిర్మాణ సంస్థ టవర్లు నిర్మించబోయే స్థలంలో కాలుపెట్టాం. అక్కడ ఇంకా గోతులు కూడా తీయలేదు. స్థలం చదును చేయలేదు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఎక్కడా మనిషి జాడ లేదు.

సాయంత్రం అయిదు దాటింది.

"అనిల్, నన్ను మా ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి, ఇవాళ్టికి వదిలెయ్. కాస్త అర్జెంటు పనుంది. రేపట్నుంచీ పూర్తిగా నీతోనే ఉంటా".

"సరే".

## శుక్రవారం

ఉదయం ఎనిమిది. కారు హైదరాబాదు శివార్లు దాటి చౌటుప్పల్ సమీపానికి చేరుకుంది.

హైవే మీంచి కుడివైపు ఉన్న డొంకరోడ్డులో రెండు కిలోమీటర్లు ప్రయాణించింది.

పెద్ద కొండ పక్కనే పంటకు పనికిరాని పొలంలో దిగాం. అప్పటికే అక్కడ ముగ్గురు వ్యక్తులున్నారు.

అనిల్‌ను చూడగానే మొహమింత చేసుకుని నవ్వారు. హైదరాబాదులో బయల్దేరి ఇక్కడికి వచ్చేదాకా అనిల్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నాడు. సంభాషణంతా భూములు, రిజిస్ట్రేషన్లు, విలువల రెట్టింపు గురించే సాగింది. తను మాట్లాడింది ఈ ముగ్గురితోనే అయి వుంటుందని ఊహించాను.

"సార్, అదిగో ఆ కొండ పక్కనుంచి ఇటు చివర తాటిచెట్ల దాకా ఇదంతా ఒకే బిట్టు, ఏడెకరాలు. మీరు చెప్పిన రేటుకు ఓనర్‌తో ఓకే అనిపించడానికి మేం పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు" - తెల్లచొక్కా అదే రంగు ప్యాంటు, నల్ల కళ్లజోడు ధరించిన వ్యక్తి చెప్పాడు. అతని మాటల్లో దళారితనం కొట్టొచ్చినట్టు కనిపించింది.

"వ్యవహారంలో ఏమాత్రం తేడా రాదుగా?"

"ఏం లేదు సార్. అన్నీ పక్కాగా క్లియర్‌గా ఉన్నాయి. కావాలంటే మీరు ఎంక్వైరీ చేసుకోవచ్చు".

"లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయా?"

"ఉన్నాయి సార్".

"ఓనర్ గారెక్కడ?"

"చౌటుప్పల్‌లో ఉన్నారు. వెళ్దామా సార్" అన్నాడొకతను.

వాళ్లు రెండు బైకుల మీద ఎక్కి మా కారుకు దారి చూపించారు.

"అనిల్, ఇది పంటభూమీ కాదు, రెసిడెన్షియల్ ఏరియానూ కాదు. కొనడం సమంజసమేనా?" అనిల్ పెద్దగా నవ్వాడు.

"మాధవ్, నేను ఏ పనినైనా ఇరవై సార్లు ఆలోచించి చేస్తాను. మనం చూసిన పొలం పక్కనే ప్రభుత్వం అపెరల్ పార్కు నిర్మించబోతుంది. ఈ విషయం ఇంకా బయటికి పొక్కలేదు. నా ఫ్రెండొకడు రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. వాడితో నేను రెగ్యులర్‌గా కాంటాక్ట్‌లో ఉంటాను. వాడు చెప్పాడు".

"కాంటాక్టంటే గుర్తొచ్చింది. వినయ్, మల్లికార్జున్‌రెడ్డి, షైలాకుమార్‌లతో మాట్లాడుతున్నావా?"

"లేదు మాధవ్. నీతో మాట్లాడ్డానికే కుదరటం లేదు. తప్పదు, మనం ఎదిగేకొద్దీ మన అవసరాలేమిటో గుర్తించడం, మనకు పనికొచ్చే వ్యక్తుల్ని లిస్ట్ అవుట్ చేసుకోవడం, వారితో కాంటాక్ట్‌లో ఉండటం తప్పనిసరి అవుతోంది".


నాకా సమాధానం రుచించలేదు. మౌనంగా ఊరుకున్నాను.

నా మౌనంతో తనకు సంబంధం లేదన్నట్లు, అనిల్ సెల్‌ఫోన్ చెవికి తగిలించుకున్నాడు.

చౌటుప్పల్‌లో ఓ టీ కొట్టులో భూమి యజమానిని కలిశాం.

రెండు గంటలపాటు చర్చలు. చివరికి ఎకరం లక్షా నలభై వేలకు ఖరారైంది. అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు, బయానా... ఎప్పుడు, ఎక్కడ, ఎవరి ద్వారా జరుగుతాయో అనిల్ వాళ్లకు వివరంగా చెప్పాడు.

సాయంత్రం ఆరు గంటలకు చౌటుప్పల్‌లో బయల్దేరాం. డైరెక్టుగా హైదరాబాదులోని ఓ పబ్‌కు తీసుకెళ్లాడు అనిల్.



అమ్మాయిలు, డ్యాన్సులు, ఘాటైన పరిమళాలు, ప్రతి ఒక్కరి చేతుల్లో మందుగ్లాసులు... మొదటిసారి పబ్ మొహం చూసిన నాకు అంతా వింతగా అనిపించింది. నాకు మందు అలవాటు లేదని చెబితే "దద్దమ్మా"అని తిట్టి, కూల్‌డ్రింక్ తెప్పించాడు. రాత్రి పది గంటలకు ఇంటికి.

## శనివారం

జీడిమెట్ల పారిశ్రామిక వాడ...

నేటి కర్తవ్యం- సిక్ యూనిట్ కొనుగోలు పథకం!

మూతబడిన ఓ కెమికల్ ఫ్యాక్టరీలో చర్చలు మొదలయ్యాయి.

అనిల్ తరఫున ఇద్దరు ఎక్స్‌పర్ట్స్ హాజరయ్యారు. ఈయూనిట్ కొనేసి, మరో 10కోట్లు పెట్టుబడి పెట్టి అన్ని హంగులతో పునఃప్రారంభించాలని అనిల్ ఆలోచన. మూడు గంటల తర్వాత బేరం కుదిరింది. ఒప్పంద పత్రాలు రాసుకున్నారు. వచ్చే నెలనుంచే అది "అనిల్ కెమికల్స్"గా ఉత్పత్తులు ప్రారంభించడానికి ప్రణాళిక సిద్ధమైంది. సిక్ యూనిట్ యాజమాన్యానికీ ఎక్స్‌పర్ట్స్‌కీ వీడ్కోలు చెప్పాం. కారు కదిలింది, ఆబిడ్స్ దిశగా.


"మాధవ్, ఈ వ్యవహారంలో కూడా నీకు బోల్డన్ని డౌట్లు ఉండి ఉంటాయి. ఆ ఇద్దరికీ కెమికల్ ఇండస్ట్రీస్‌లో ఇరవయ్యేళ్ల పని చేసిన అనుభవం ఉంది. పెట్టుబడి నాది, మెదడు వాళ్లది. వాళ్లను కేవలం ఉద్యోగులుగా మాత్రమే తీసుకోవడం లేదు. కొద్దిగా పార్ట్‌నర్‌షిప్ కూడా కట్టబెడుతున్నాను. అప్పుడు వాళ్లు బాధ్యతగా ఫీలవుతారు. లాభాలు తేవడానికి రాత్రింబవళ్లు పనిచేస్తారు" వివరణ ఇచ్చాడు అనిల్.

నేను మాట్లాడలేదు. ఆ ఫీల్డులో లాభనష్టాల గురించి విశ్లేషించేంత పరిజ్ఞానం నాకు లేదు కాబట్టి మౌనంగా ఉండిపోయాను.

ఆబిడ్స్‌లో ఓ ఖరీదైన రెస్టారెంట్లో భోంచేసి, ఫర్నిచర్ షాపుకెళ్లాం.

అనిల్ వాళ్ల ఇంట్లోకని సోఫాసెట్టు, డైనింగ్ టేబులు తీసుకున్నాడు. బిల్లు లక్షా నలభై అయిదు వేలు!

"అమ్మా నాన్నలే కదా ఉండేది, ఇంత ఖరీదైన ఫర్నిచర్ అవసరమా?" అడగకుండా ఉండలేకపోయాను.



టీవీలో లుంబినీ పార్కునీ, గోకుల్‌చాట్‌నీ మార్చి మార్చి చూపిస్తున్నారు. రక్తసిక్తమైన పరిసరాలూ, తెగిపడిన అవయవాలూ క్లోజప్ కోణాల్లో భీతి గొల్పుతున్నాయి.

"పోన్లేరా, ఇన్నాళ్లూ కష్టపడ్డారు. కొడుకు ఎక్కివచ్చాకైనా కాస్త సుఖపడనీ. అదీకాక ఇంటికొచ్చే ప్రతిఒక్కరూ- కొడుకు జపాన్‌లో జాబ్ చేస్తున్నాడు, ఇంట్లో ఇప్పటికీ పాత సామానే ఉందేమిటీ- అని అడుగుతున్నారట. అమ్మ ఒకటే పోరు ఫోన్లో".

ఫర్నిచర్ లారీకెత్తించి, డ్రైవర్ని దాని వెంట పంపించాం.

నేను డ్రైవింగ్ సీట్లో కూచున్నాను.

రాత్రి ఎనిమిదిన్నర దాటింది. నా సెల్ మోగింది.

"మాధవ్, నేను భాస్కర్‌ని. ఎక్కడున్నావ్?"

"ఆబిడ్స్ నుంచి ఇంటికెళ్తున్నా. నాంపల్లి దగ్గర్లో ఉన్నా".

"గోకుల్ చాట్‌లో బాంబులు పేలాయి... మన ఫ్రెండు వెంకట్ చనిపోయాడట..." కారు పక్కకు తీసి ఆపాను.

వెంకట్ డిప్లొమాలో మా ముగ్గురికీ రూమ్మేట్.

"అనిల్, బ్యాడ్‌న్యూస్. గంట క్రితం గోకుల్‌చాట్‌లో బాంబు పేలి చాలామంది చనిపోయారట".

"అదీ సంగతి. ఇందాకట్నుంచీ పోలీసు జీపులు తెగ పరుగులు తీస్తుంటే, అర్థం కాలేదు".

"పేలుళ్లలో చనిపోయిన వారిలో మన వెంకట్ కూడా ఉన్నాడట, భాస్కర్ ఫోన్ చేశాడు".

"మై గాడ్! షిట్, ఇలా తయారైందేమిటీ హైదరాబాద్?"

"అనిల్, ఓసారి కోఠి వెళ్లొద్దామా?"

"అదంత తేలిగ్గాదు. ఇప్పుడు పోలీసులు ఆ చుట్టుపక్కలకు కూడా రానివ్వరు".

"పోనీ, వాళ్లింటికి వెళ్దాం రా".

"ఉఫ్ఫ్... బాగా టైరైపోయానురా".

"ప్లీజ్..."

"ఇల్లెక్కడ?"

"గాంధీనగర్".

"సరే, పద".

మనసంతా చేదెక్కింది. వెంకట్ జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. రోడ్డు మీదే కారు ఆపి, ఇంట్లోకి నడుస్తుంటే కాళ్లు వణికాయి. ఇంటి నిండా జనం. వెంకట్ వాళ్ల అమ్మా నాన్నలు స్పృహ తప్పినట్లున్నారు, సెలైన్లు ఎక్కిస్తున్నారు. బంధువులు రోదిస్తున్నారు. జనం గుమిగూడారు.

మేం నిశ్శబ్దంగా వెళ్లి హాల్లో నిలబడ్డాం.

ఓ మూలనున్న టీవీలో లుంబినీ పార్కునీ, గోకుల్‌చాట్‌నీ మార్చి మార్చి చూపిస్తున్నారు. రక్తసిక్తమైన పరిసరాలూ, తెగిపడిన అవయవాలూ క్లోజప్ కోణాల్లో భీతి గొల్పుతున్నాయి. నగరంలోని ఆసుపత్రుల్లో గుర్తించిన మృతదేహాల ముందు అయినవారు కూలబడి, పొగిలిపొగిలి ఏడుస్తున్నారు. గాయపడి చికిత్స పొందుతున్న అభాగ్యులు కొద్దిసేపటి ముందు గుండెల్లో పేలిన బాంబుల నుంచి బయట పడేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. నాకే కాదు, అనిల్‌కీ కన్నీరాగలేదు. అక్కడ నిలబడలేక, బయటికి నడిచాం.

## ఆదివారం

తెల్లవారుజామున అయిదు గంటలకే కారు బయల్దేరింది.

మా వెనక సుమోలో అనిల్ వాళ్ల అమ్మా నాన్న, చెల్లి, మరో ముగ్గురు బంధువులు... ఎనిమిది గంటలకల్లా సూర్యాపేట చేరుకున్నాం. మార్కెట్టుయార్డు సెంటర్లో ఓ ఖరీదైన భవనం.

మూడు రకాల టిఫిన్ల తర్వాత తంతు ప్రారంభమైంది.

పట్టుచీర కట్టుకుని, ఒంటినిండా నగలు పెట్టుకుని ఆ అమ్మాయి సిగ్గుపడుతూ వచ్చి అనిల్‌కు ఎదురుగా సోఫాలో కూచుంది.

టిఫిన్ తింటున్నప్పుడే అమ్మాయి వాళ్ల నాన్నను అనిల్ వాళ్ల నాన్న రకరకాల ప్రశ్నల్లో ఇరికించి, ఆస్తిపాస్తుల వివరాలు రాబట్టాడు.

అమ్మాయిని అనిల్ వాళ్ల అమ్మ కొన్ని ప్రశ్నలు అడిగింది. వాళ్ల చెల్లీ, బంధువులూ కూడా శక్తివంచన లేకుండా విసిగించారు.

అనిల్ మాత్రం మౌనంగా కూచున్నాడు.

"అంటే, నువ్వు కూడా సిగ్గుపడతావన్న మాట..." అన్నాను అనిల్ చెవిలో?

"మనకివన్నీ నచ్చవు" అన్నాడు.

"బాబూ తమరేమీ మాట్లాడ్డం లేదు..." అన్నాడు మధ్యవర్తి అనిల్‌ను ఉద్దేశించి.

"నేను ఒంటరిగా మాట్లాడతాను" అని కళ్లతోనే చెప్పాడు.

పక్కనే ఉన్న గదిలోకి వెళ్లిందా అమ్మాయి. వెనకే వీడూ...

పావుగంట తర్వాత తిరిగొచ్చారు.

మళ్లీ ప్రయాణం! ఈసారి మాచర్ల దిక్కు.

మధ్యాహ్నం ఒంటిగంట. ఆ ఇల్లూ ఇంట్లో ఫర్నిచరూ మనుషులూ మాటలూ అన్నీ మహా ఖరీదుగా కనిపించాయి.

పలకరింపులయ్యాక, అమ్మాయిని ప్రవేశపెట్టారు. జీన్సు, టీషర్టు వేసుకుని, క్యాజువల్‌గా వచ్చి కుర్చీలో కూచుంది.

సూర్యాపేటలోలాగా ఇక్కడ అనిల్ వాళ్ల అమ్మానాన్న ఆస్తుల గురించి కూపీ లాగలేదు. బహుశా అక్కర్లేదని వాళ్ల ఉద్దేశం కావచ్చు.

ఈసారి అమ్మాయి వాళ్ల అమ్మే మాట్లాడింది. వాళ్ల నాన్న కూడా ఆ స్థాయిలో నిలబడాలని తెగ ఆరాటపడ్డాడు.

చివరిగా మళ్లీ అనిల్ ఏకాంతంలోకి వెళ్లి చర్చలు జరిపాడు.

భోంచేసి వెళ్లమని వాళ్లు పట్టుపట్టారు. సంప్రదాయం ప్రకారం ససేమిరా అంది అనిల్ వాళ్ల అమ్మ.

మాచర్లలో ఉన్నంతలో పెద్ద హోటల్‌కు వెళ్లాం.

భోజనాలయ్యాక వాహనాలు సత్తెనపల్లి బాట పట్టాయి.

"మాచర్ల అమ్మాయి నచ్చిందా?" అడిగాను.

"ప్చ్, వేషం ఆధునికమే తప్ప మనసు మెచ్యూర్ కాలేదురా" నిట్టూర్పు విడిచి, సీట్లో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు అనిల్.

సత్తెనపల్లిలోనూ అదే తతంగం. అక్కణ్నించి గుంటూరు...

"అనిల్, నాకో డౌటు. ఆ అమ్మాయిల్ని ఏం అడుగుతున్నావు?"

వాడు నవ్వి "ఈసారి ఆ అవకాశం కల్పిస్తాలే" అన్నాడు.

"వద్దులే బాబూ, ఏదో ఉత్సుకత ఆపుకోలేక అడిగాను".

షెడ్యూలు ప్రకారం సాయంత్రం ఏడు గంటలకు గుంటూర్లో పెళ్లి చూపులు. కానీ తొమ్మిది గంటలకు చేరుకున్నాం.

వాళ్లు ఓపిగ్గా ఎదురుచూస్తున్నారు.

మళ్లీ తంతు మొదలు.

అమ్మాయి గదిలోకి వెళ్లింది. ఆమె వెనక తనూ వెళ్లబోతూ, ఒక్క క్షణం ఆగి, చెయ్యి పట్టుకుని పైకిలేపి, నన్నూ లాక్కెళ్లాడు.

మేమిద్దం సోఫాలో, ఆ అమ్మాయి ఓ కుర్చీలో.

"పూర్తిపేరు..." అనిల్ మొదలుపెట్టాడు.

"ఆరుమళ్ల సాయిసుప్రజ".

"ఇంజినీరింగ్ ఎప్పుడు పూర్తయింది?"

"రీసెంట్‌గానే... డిస్టింక్షన్ వచ్చింది".

"ఉద్యోగం చేయాలనుకుంటున్నారా?"

"అవును. మీకేమైనా అభ్యంతరమా?"

"నోనో. నాటెటాల్. బట్ ఆల్రెడీ నేనో వ్యాపారంలో పాతుకుపోయాను. దేశం కాని దేశం వెళ్లి నాకంటూ ఓ సామ్రాజ్యాన్ని సృష్టించుకోగలిగాను. అది ఇంకా విస్తరిస్తోంది. అందుకు నేనొక్కణ్నీ సరిపోను. నాకు తోడుగా వచ్చే మనిషి నా వ్యాపారానికీ నీడగా నిలవాలని..." వ్యాపారానికి వాడెంత ప్రాముఖ్యమిస్తాడో స్పష్టంగా చెప్పగలిగాడు.

"నో సర్. నాకు వ్యాపారమంటే అస్సలు గిట్టదు. ఉదయం లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునేదాకా లాభనష్టాల బేరీజు వేసుకోవడం తప్ప సుఖసంతోషాలపై దృష్టి పెట్టలేం. అదే ఉద్యోగమైతే, పరిమిత గంటలు కష్టపడతాం. నిర్భయంగా నెలాఖరున జీతం తీసుకుంటాం" ఆ అమ్మాయి కూడా అంతే స్పష్టంగా చెప్పడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఇట్స్ ఓకే సుప్రజ. కీపిటొ" అంటూ ఆమెతో కరచాలనం చేసి, బయటికి నడిచాడు అనిల్. వాడి వెనకే నేనూ, ఆ అమ్మాయీ.

## సోమవారం

విజయవాడలో గిర్రున మూడు దినపత్రికల కార్యాలయాలు చుట్టివచ్చాం. అనిల్ ఓ చిన్న ప్రకటన ఇచ్చాడు. తప్పనిసరిగా రేపే ప్రచురితం కావాలని కోరాడు. ఆ తరువాత కేశవ్ అనే కుర్రాడికి ఫోన్ జేశాడు.

అరగంటలో అతనొచ్చాడు. మరో అరగంటపాటు అనిల్‌కు ఓ ఇంటి గురించి వివరాలు చెప్పాడు.

కారులో బయల్దేరాం. ముందుగా మొగల్రాజపురం... అక్కడో మూడంతస్తుల భవనాన్ని చూపించాడు కేశవ్.

ఆ ఇంటి యజమానిని అనిల్ యక్షప్రశ్నలు వేశాడు.

అక్కడి నుంచి బందరు రోడ్డులోకి వచ్చాం.

మెయిన్‌రోడ్డు మీంచి సన్నటి సందులో యాభై అడుగులు లోపలికి నడిస్తే, ఓ షాపింగ్ కాంప్లెక్స్! పాతబడి, కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అది అమ్మకానికి వచ్చిందని కేశవ్ చెప్పాడు.

"చాలా తక్కువ రేటుకు వస్తుంది సార్. దీన్ని పడేసి, మల్టీ షాపింగ్ కాంప్లెక్స్ కడితే బ్రహ్మాండంగా అద్దెలు వస్తాయ్" కేశవ్ చెప్పాడు.

"డాక్యుమెంట్లన్నీ క్లియర్‌గా ఉన్నాయా?"

"చూశాను సార్. అన్నీ క్లియర్‌గానే ఉన్నాయి".

"గవర్నమెంట్ నుంచి ఏమైనా అబ్జెక్షన్స్ ఉన్నాయేమో చూడు, దీన్ని ఫైనల్ చేద్దాం".

"అలాగే సార్. రేపటికల్లా అన్ని వివరాలూ చెబుతా".

## మంగళవారం

విజయవాడలో త్రీస్టార్ హోటల్‌లో ఇంటర్వ్యూలు మొదలయ్యాయి. వందమందికి పైగా రిసెప్షన్‌లో వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. 'ప్రాజెక్టు మీది, పెట్టుబడి మాది' అంటూ ఆరోజు ఉదయం పేపర్లో వచ్చిన ట్రీమీ ప్రకటనకు ఇంత స్పందన వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. వచ్చిన వాళ్లలో ఎక్కువమంది నిరుద్యోగులే. అందులోనూ ఇంజినీర్లు ఎక్కువ. వాళ్లు తెచ్చిన ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను తీసుకోవడం, ప్రాథమిక ఆలోచన ఏమిటో తెలుసుకోవడం, అమల్లో ఎదురయ్యే సాధకబాధకాలు, రూపాయి రాకపోకలు, ఇతరత్రా వివరాల గురించి గుచ్చి గుచ్చి ప్రశ్నించడం...ఆనక వారం రోజుల్లో తెలియజేస్తానంటూ సాగనంపడం... ఇదీ ప్రహసనం.

సాయంత్రానికి మొత్తం 163 ప్రాజెక్ట్ ప్రపోజల్స్ పోగుపడ్డాయి.

ఆ రాత్రి... హోటల్లో భోంచేస్తుండగా అడిగాను "అనిల్, రేపేమిటి ప్రోగ్రామ్" అని.

"ప్రత్యేకంగా ప్లాన్ చేసుకున్నదైతే ఏమీ లేదు. హైదరాబాద్ వెళ్తే బెటర్ అనుకుంటున్నాను".

"ఇన్ని రోజులపాటు నిన్నేమీ అడగలేదు. ఇప్పుడడగనా?"

"రేయ్ ఫూల్, ఏమిటా వేడికోలు? విషయం చెప్పు".

"రేపు హరిశ్చంద్రపురం వెళ్దాం. అక్కడ నా డ్రీమ్ ప్రాజెక్ట్ ఉంది. మూడేళ్ల నుంచి అప్పులు చేసి మరీ దాన్ని నడుపుతున్నాను. చూద్దువుగానీ".

"బడుద్దాయ్, దీనికే ఇంత బతిమాలాలా? అలాగే".

## బుధవారం

అయిదెకరాల విస్తీర్ణంలో దీర్ఘ చతురస్రాకారపు కాంపౌండ్ వాల్. మధ్యలో పెద్ద గేటు. దానికి ఎడం పక్క "చేయూత-చిన్నారుల దేవాలయం" అనీ, కుడి పక్కన 'భరోసాల-పెద్దల దేవాలయం' అనీ బోర్డులున్నాయి. బయటే కారు పార్క్ చేసి, కిందికి దిగగానే ఆ బోర్డుల్ని చూస్తూ "ఇదేంటి, ఇవి గుడులు కాదు కదా!" అన్నాడు అనిల్.

"నా దృష్టిలో అంతకన్నా ఎక్కువే" సమాధానమిచ్చాను.

ఎడం పక్క ఉన్న బిల్డింగులోకి నడిచాం. దగ్గరగా వెళ్లాక అక్కడి వాతావరణం చూసి "ఓహో, చిన్నారుల దేవాలయం అంటే స్కూలా!" అన్నాడు అనిల్. ఆఫీసు రూములోకి వెళ్లగానే, నన్ను చూసి ప్రిన్సిపాల్ లేచి నిలబడ్డాడు. ఆయనకు ఎదురుగా కూచున్నాం.

"మొత్తం ఎంతమంది?" అనిల్ ప్రశ్న.

"147. వీరిలో 36 మంది అనాథలు, మిగతా వారంతా వికలాంగులు" చెప్పాను.

"మామూలు పిల్లల్లేరా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేరు. కేవలం ఈ రెండు విభాగాలకే పరిమితం చేశాను".

టీ తాగి, తరగతి గదులవైపు బయల్దేరాం.

అప్పుడే ఇంటర్వెల్ కొట్టారు. పోలియో బాధితులు, చేతుల్లేని వాళ్లు, రెండు కర్రలు ఊతంగా నడుస్తున్నవాళ్లు... అటూ ఇటూ వెళ్తూ నాకు దగ్గరగా వచ్చి "హాయ్ మాధవ్, బాగున్నావా?" అనేసి వెళ్లిపోతున్నారు.

అది చూసిన అనిల్ "ఏమిటి, సమ్మర్‌హిల్ వాతావరణం కనిపిస్తోంది"

**ఇవాళ పిల్లలు తాతయ్య-నానమ్మల ఆత్మీయతను కోల్పోతున్నారు. పెద్దలు పిల్లల ఆదరణకు దూరమవుతున్నారు. ఆ ఇద్దరినీ ఒకేచోట ఉంచితే ఎంతో ప్రయోజనం ఉంటుందని నా నమ్మకం.**



అన్నాడు నవ్వుతూ.

"ఆ స్థాయి కాకపోయినా, అలాంటి వాతావరణం కోసం ప్రయత్నిస్తున్నాం". హడావుడిగా నాకు దగ్గరగా రాబోయిన కాళ్లలేని కుర్రాడు గభాల్న కింద పడ్డాడు. అనిల్ కంగారుపడుతూ గబగబా దగ్గరగా వెళ్లి లేవదీయబోయాడు. నేను వారించాను. మెల్లగా ఆ కుర్రాడే లేచి, కర్రలందుకుని మళ్లీ నడక సాగించాడు.

"మరేం లేదు. ఇప్పట్నుంచే పడిలేవడం అలవాటు చేస్తున్నాం" వివరణ ఇస్తున్నట్లుగా అన్నాను.

తరగతి గదుల్లోని వాతావరణాన్నీ, బోధనా పద్ధతుల్ని అడిగి తెలుసుకున్నాడు అనిల్.

పది నిమిషాల తర్వాత ప్రిన్సిపాల్ నుంచి పిలుపు.

మేం వెళ్లేసరికి పిల్లలంతా మీటింగ్ హాల్లో ఉన్నారు. చిన్న వేదిక మీద రెండు కుర్చీల్లో నేనూ, అనిల్ కూచున్నాం.

"డియర్ ఫ్రెండ్స్, నాకో మిత్రుడున్నాడు. చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాడు. ఎకరం పొలం... అదీ సరిగా పండదు. కుటుంబం గడవడమే కష్టమయ్యేది. పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ అతి కష్టమ్మీద డిగ్రీపూర్తి చేశాడు. అలా కష్టాలకు ఎదురు నిలవడం అలవాటుగా మార్చుకున్నాడు. కాబట్టే అతను పై చదువులకు జపాన్ వెళ్లగలిగాడు. అక్కడే ఉద్యోగం సంపాదించాడు. ఇప్పుడు వ్యాపారంలో కూడా రాణిస్తూ, ఉన్నత స్థితికి చేరుకున్నాడు. అతనెవరోకాదు, నాపక్కనే ఉన్న ఈ వ్యక్తే. పేరు అనిల్" పిల్లలు చప్పట్లతో అభినందనలు కురిపించారు.

"ఇప్పుడు అనిల్ మాట్లాడతాడు" అంటూ ఆహ్వానించాను.

అనిల్ లేచి నిలబడి "నాకు బాగా మాట్లాడటం రాదు. కానీ మిమ్మల్ని చూశాక నాలుగు మాటలు మాట్లాడాలనిపిస్తుంది. చిన్నప్పుడు ఓ కొటేషన్ చదివాను- ఒక్క అపజయం వెక్కిరించగానే కన్నీటి పర్యంతం

కాకూడదనీ, మళ్లీ మళ్లీ ప్రయత్నించడానికి సదా సిద్ధంగా ఉండాలనీ దాని సారాంశం. నేనా సూత్రాన్ని పాటించాను. మీరూ పాటించండి, విజయం సాధించండి" అనిల్ మాటలు పూర్తి కాకముందే చప్పట్లు మార్మోగాయి. ఆ తర్వాత కొంతమంది పిల్లలు అనిల్‌ను చుట్టుముట్టి రకరకాల ప్రశ్నలు వేశారు. అక్కడి నుంచి, వృద్ధాశ్రమానికి వెళ్లాం. గది గదికీ వెళ్లి చూశాడు అనిల్.

"పిల్లల స్కూలునీ వృద్ధాశ్రమాన్నీ ఒకేచోట పెట్టడానికి కారణం?" అనిల్ అనుమానం.

"ఇవాళ పిల్లలు తాతయ్య-నానమ్మల ఆత్మీయతను కోల్పోతున్నారు. పెద్దలు పిల్లల ఆదరణకు దూరమవుతున్నారు. ఆ ఇద్దరినీ ఒకేచోట ఉంచితే ఎంతో ప్రయోజనం ఉంటుందని నా నమ్మకం. నమ్మకమే కాదు, ఆ ఫలితాల్ని ఇక్కడ కళ్లారా చూస్తున్నాను..."ఇంకా ఏదో చెప్పబోతుండగా అటెండర్ వచ్చి ప్రిన్సిపాల్ రమ్మంటున్నాడని చెప్పాడు. ఆఫీసు రూములోకి వెళుతుంటే బయట ఓ మహిళ, ఏడేళ్ల బాలుడు కనిపించారు.

"సార్, ఒకామె హైదరాబాద్ నుంచి వచ్చింది. తన కొడుకును మన స్కూల్లో చేర్చుకోమని అడుగుతోంది" చెప్పాడు ప్రిన్సిపాల్.

"ఆమెను లోపలికి పిలువ్" అటెండర్‌కు చెబుతూ కుర్చీలో కూచున్నాను. నా పక్కనే అనిల్. ఆమె తన కొడుకును ఎత్తుకొని లోపలికి తీసుకొచ్చి, ఆ కుర్రాడ్ని నేలమీదే కూచోబెట్టింది.

"చెప్పమ్మా, ఎక్కడ్నించి వచ్చావు?"

ఆమె రెండు చేతులూ జోడించి చెప్పడం మొదలుపెట్టింది.

"నా పేరు శోభాబాయి సారూ. మా ఆయన కిషన్‌లోడె. అయిదేళ్ల కిందట మహారాష్ట్రలోని లాతూర్‌జిల్లా నిలంగ తాలూకానించి పొట్ట చేత బట్టుకుని వలసొచ్చినాం. నాలుగేళ్ల సిన్నా సితకా పన్లు జేసినం. నిరుడు ఇద్దరం గోకుల్‌చాట్‌లో పనికి కుదిరాం. రామంతాపూర్‌లో ఓ గది అద్దెకు తీస్కోని బతుకుతున్నం. ఈ పిల్లాణ్ని ఇస్కూలుకు పంపిత్తన్నం. మొన్న శనివారం నాడు ఇద్దరం పనికెళ్లడానికి బయల్దేరినం. ఈ పిల్లోడికి ఆరోజు బడిలేదు. నేనూ వత్తానని ఏడిస్తే, పట్టుకెళ్లినం. సాయంత్రం 5.30 గంటలకు మా డ్యూటీ అయిపోయింది. ఆయన 'ఈ నాలుగు ప్లేట్లు కడిగొత్తాలే' అంటే నేనూ మా పిల్లోడు బయటికొచ్చి నిలబడ్డాం. ఎంతకీ రాకపోవటంతో పిలుచుకురమ్మని పిల్లోణ్ని పంపించిన. ఈడట్టా పొయ్యాడో లేదో బూమి బద్దలయ్యే మోత ఇనవడ్డది. తీరా సూత్తే ఆయన శవం కనవడ్డదీ. ఈడికి కాలు తెగివడింది..." ఆ కుర్రాడికి కుడికాలు మోకాలు దాకా లేకపోవడం, మోకాలి దగ్గర వేసిన కట్టు మీద రక్తపు చారికలు గడ్డ కట్టుకుపోవడం అప్పుడు గమనించాను.

"దర్మాసుపత్రిలో జేర్చిన. రెండ్రోజులక్కడే ఉన్నాం. ఆదుకునేదెవరు? చేతిలో రూపాయి లేదు. అప్పుడు దేవుడులా ఒకాయన కనిపించి, మీ సంగతి జెప్పాడు. చార్జీలకు డబ్బులు కూడా ఇచ్చాడు. రైలెక్కి ఇట్టా వచ్చినం. నీట ముంచినా పాల ముంచినా బారం మీదే బాబూ" అంటూ ఆమె పవిటచెంగుతో కన్నీటిని తొక్కి పెట్టే ప్రయత్నం చేసింది.

"పర్లేదమ్మా, ఏడవకు. ప్రిన్సిపాల్‌గారూ, ఈ కుర్రాడికి అడ్మిషన్ ఇవ్వండి. అంతకన్నా ముందు గుంటూరు తీసుకెళ్లి, వైద్యం చేయించండి". అరగంట తర్వాత ఆ ఆవరణలోంచి బయటికి నడుస్తుండగా... అనిల్ నా చేతిని నొక్కాడు అభినందనపూర్వకంగా!

***

అనిల్ తిరిగి జపాన్ వెళ్లిన వారం రోజులకు నాకో మెయిల్ వచ్చింది అతన్నుంచి. దాని సారాంశం ఇదీ క్లుప్తంగా..."డియర్ మాధవ్, చౌటుప్పల్ దగ్గర నేను కొన్న భూమిలో నాలుగెకరాల్లో 'అనిల్ అనురాగ కేంద్రం' స్థాపించాలని నిర్ణయించుకున్నాను. రాష్ట్రవ్యాప్తంగా నీకున్న నెట్‌వర్క్ ద్వారా వృద్ధుల్ని, అనాథపిల్లల్ని, వికలాంగుల్ని గుర్తించి, వారిని ఈకేంద్రంలో చేర్పించాలి. వసతి, విద్య, ఇతర సౌకర్యాలు... అన్నీ వారికి ఉచితంగా అందించాలి. వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించమని మా నాన్నగారిని పురమాయించాను. వచ్చే ఏడాది ఈ పాటికల్లా సంస్థ ప్రారంభోత్సవం జరగాలి. బాధ్యతలన్నీ నీవే. ఇప్పుడు నువ్వు చేస్తున్న ఉద్యోగం మానేసి అనురాగ కేంద్రం పగ్గాలు చేపట్టాలి. ఇందుకుగాను నీకు నెలకు అరవై వేలు శాలరీగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. ఈ విషయంలో నీ నుంచి వచ్చే అభ్యంతరాలనూ పరిగణనలోకి తీసుకోను. నా నమ్మకాన్ని వమ్ము చేయవని నాకు తెలుసు. ఉంటా మరి.

- అనిల్"

ఆ మెయిల్ ఫలితమే... ఈనాటి అనురాగకేంద్రం ప్రారంభోత్సవం.

ఒక్కో అతిథీ మాట్లాడటం పూర్తయింది. ముఖ్య అతిథికి ముందు అనిల్ లేచాడు. చాలా ఉద్వేగానికి గురయ్యాడు. ఏదో చెప్పాలనీ, తన హృదయంలోని సంఘర్షణకు మాటలరూపం ఇవ్వాలన్న తాపత్రయంలో ఏదీ సరిగా చెప్పలేకపోయాడు. ముగించే ముందు మాత్రం... "ఈ గొప్పతనమంతా నాది కాదు. నా మిత్రుడు మాధవ్‌ది. ఈ కేంద్రం ప్రారంభోత్సవం అనుకున్న దగ్గర్నుంచీ తను నాకేదో అద్భుతమైన కానుక ఇస్తానంటూ ఊరిస్తున్నాడు. అది కూడా ఈ వేదిక మీదే ఇస్తానన్నాడు. నా మిత్రుడి నుంచి నాకు లభించబోయే అభినందనపూర్వకమైన ఆ కానుక ఏదో తెలుసుకోవాలని కొంచెం ఆతృతగా ఉంది. డియర్ మాధవ్... ప్లీజ్ కమాన్ టు ది డయాస్..." అంటూ నన్ను ఆహ్వానించాడు.

నేను వేదికనెక్కి మైకు ముందు నిలబడి గొంతు సవరించుకున్నాను.

"14 నెలల క్రితం అనిల్‌తో వారం రోజులు కలిసి తిరిగాను అప్పుడు అతనో కరెన్సీ ముద్ద. వ్యాపారవ్యాఘ్రం. కానీ ఇప్పుడతనిలో మదర్ థెరిసా కనిపిస్తోంది. నాకు పట్టలేనంత సంతోషంగా ఉంది. అనిల్‌కు నేను కానుక ఇస్తానన్న మాట వాస్తవమే. కానీ కోట్ల రూపాయలు ఆర్జించిన వ్యక్తికి నేను ఎన్ని కిలోల బంగారం ఇచ్చినా అది వెలవెల బోతుంది. అందుకే అతనికి నచ్చే దానినే కానుకగా ఇవ్వబోతున్నాను. ఈ అనురాగకేంద్రంలో చేర్చడానికి నేనో వ్యక్తిని సెలక్ట్ చేశాను. అతనికే మొదటి అడ్మిషన్ ఇవ్వాల్సిందిగా అనిల్‌ను కోరుతున్నాను. అతనెవరంటే..." మైకుకు చేతిని అడ్డం పెట్టి వెనుకవైపు చూశాను. నా సంజ్ఞ కోసమే ఎదురుచూస్తున్న ఓ వ్యక్తి వెంటనే తెర వెనక్కి వెళ్లి, వీల్‌ఛైర్‌తో వేదిక మీదికి... అతిథుల ముందుకు... వచ్చాడు.

ఆ ఛైర్‌లో ఓ యువకుడున్నాడు. నేనందుకున్నాను.

"వీల్‌ఛైర్‌లో కూచున్న ఈ యువకుడి పేరు సదాశివరెడ్డి. వయసు 27 సంవత్సరాలు. ఎంటెక్ పూర్తిచేసి విజయ ఎలక్ట్రికల్ కంపెనీలో డిజైనింగ్ ఇంజినీరుగా చేరాడు. ఆరోజు... ఆగస్టు 25. డ్యూటీ ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లడానికి బస్సెక్కాడు. కోఠిలో దిగి, మరో బస్టాప్ వద్దకు వెళ్లబోతుండగా సహోద్యోగి కలిశాడు. సరదాగా మాట్లాడుకుంటూ గోకుల్ ఛాట్‌లో టిఫిన్ చేద్దామని వెళ్లారు. తినడం పూర్తయింది. కౌంటర్‌లో డబ్బు చెల్లించబోతుండగా... ఒక్కసారిగా బాంబు బద్దలైంది. బాంబులోని 15 గుండ్లు ఇతని శరీర భాగాల్లోనికి దూసుకెళ్లాయి. కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న ఇతన్ని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు ఆపరేషన్ చేసి ప్రాణాలు నిలబెట్టగలి గారు. కానీ కాళ్లలో శక్తిని నింపలేకపోయారు. కన్నును కాపాడలేకపోయారు. జ్ఞాపకశక్తిని తిరిగి తీసుకురాలేకపోయారు. అమ్మానాన్నల్ని కూడా గుర్తించలేడు. ఆరు నెలలు శ్రమించిన డాక్టర్లు... ఇక తామేమీ చేయలేమంటూ డిశ్చార్జి చేశారు. 2008 జనవరి 25న సదాశివరెడ్డి ఇంటికి చేరుకున్నాడు..." అతిథుల నుంచి ఆహూతుల దాకా మంత్రముగ్ధులై నిశ్శబ్దంగా వింటున్నారు.

"కదల్లేడు, మెదల్లేడు. పసిపిల్లవాడికన్నా హీనస్థితి. పెడితే తింటాడు, లేకుంటే లేదు. మాట, నడక, చూపు, వినికిడి... అన్నీ నిల్చిపోయాయి. మతిస్థిమితం కోల్పోయాడు. అన్నీ మంచంపైననే. నిత్యం ఇంట్లోనే చికిత్స. నెలకు పాతికవేల ఖర్చు. ఎంబీఏ చదివిన తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి... అదుగో సదాశివరెడ్డిని వేదికపైకి తీసుకొచ్చిన కుర్రాడే (అతను రెండు చేతులూ జోడించి అందరికీ నమస్కారం పెట్టాడు) ...ఉద్యోగం మానేసి తల్లిదండ్రులకు తోడుగా ఉండి అన్న మంచిచెడ్డలు చూసుకుంటున్నాడు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు లేకపోయినా సదాశివరెడ్డికి పూట గడవదు. ఆదుకుంటానన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేకపోయింది. ట్రాన్స్ ఫార్మర్ల లిఫ్టింగ్‌కు సులువు మార్గం కనిపెట్టి, రెండుసార్లు జపాన్ వెళ్లివచ్చిన ఈ సదాశివరెడ్డిని నేను నా ఆప్తమిత్రుడు అనిల్‌కు కానుకగా... ఈ అనురాగ కేంద్రానికి మొదటి లబ్ధిదారుగా అందిస్తున్నాను..."

చప్పట్ల మోత... అనిల్ మెల్లగా లేచి... సదాశివరెడ్డి ఎదురుగా మోకాళ్ల మీద కూచున్నాడు. మొహంలో మొహం పెట్టి చూశాడు... అతని రెండు చెంపలూ నిమిరాడు...

నేనూ దగ్గరగా వెళ్లాను... అమాంతం నన్ను కౌగిలించుకున్నాడు... అనిల్ కన్నీరు నా భుజాల మీంచి కిందికి జారుతోంది...

**(ఉగ్రవాదుల బాంబు పేలుళ్లలో అర్ధాంతరంగా అంగవికలురవుతున్న అమాయకులకు అక్షర సానుభూతితో)**